గుడిలో జారిపడ్డ మాజీ మంత్రి రేవణ్ణ

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, జేడీఎస్ నేత రేవణ్ణ గుడిలో కాలు జారిపడ్డారు. పక్కటెముకకు దెబ్బ తగలడంతో హొళెనరసీపుర ప్రభుత్వ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఏకాదశి పండుగను పురస్కరించుకుని గురువారం ఉపవాసం ఉన్న రేవణ్ణ, హొళెనరసీపురలోని హరదనహళ్ళి గ్రామ ఆలయానికి వెళ్లారు. లక్ష్మీనరసింహస్వామికి పూజలకోసం వెళ్తుండగా కాలుజారి పడ్డారు. వెంటనే సహాయకులు ఆసుపత్రికి తరలించారు. కట్టు కట్టిన వైద్యులు, విశ్రాంతి అవసరమని సూచించారు.

ఉత్తరంలో బీభత్సం

- కుండపోతగా వర్షాలు
- కావేరి ప్రాజెక్టులకు వరదపోటు
- ఆల్మట్టికి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అంకోలా తాలూకాలో విరిగిపడ్డ మట్టిచరియలు
- చిక్కమగళూరు జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తం



ఉత్తర కన్నడ జిల్లాలో దెబ్బ తిన్న రహదారులు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటకలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. తీరప్రాంతాలు, పశ్చిమ కనుమలతోపాటు ఎగువన ఉన్న కేరళ , మరోవైపున మహారాష్ట్రలో భారీ వర్షాలతో ప్రాజెక్టులను వరదనీరు ముంచెత్తుతోంది. దాదాపు పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉత్తరకన్నడ జిల్లాలో భారీ నష్టం వాటిల్లింది. అంకోలా తాలూకాలో మట్టి చరియలు విరిగి పడిన ప్రమాదంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఉత్తరకన్నడ జిల్లా అంతటా అతలాకుతలమైంది. 26 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 2400మందికి ఆశ్రయం కల్పించినట్లు జిల్లా అధికారి లక్ష్మీప్రియ ప్రకటించారు. హొన్నావరలోనే 14, కారవార, కుమటలో కలిపి 12 సహాయ కేంద్రాలు తెరిచామన్నారు. ఇక తీర ప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల వ్యాప్తంగాను వరుణుడు దాడి కొనసాగుతోంది. నేత్రావతి, కుమారధార, మృత్యుంజయ, ఫల్గుణి, కపిల, సోమావతి నదులు ఉడుపి జిల్లాలోని మడిసాలు, స్వర్ణ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నదీ తీరంలోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. కుక్కె సుబ్రమణ్యలో కుమారధార నది ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది. కిండి ఆనకట్ట మునిగింది. స్నానఘట్టాలు మునిగాయి. కోయ్నాడులో పాఠశాల పైకప్పు కూలిపోయింది. హొశహొన్నూరు సమీపంలో కరడిరంగప్పకు చెందిన ఇల్లు ముందు భాగం కుంగిపోయింది. తీరప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.



శృంగేరిలో నీట మునిగిన రహదారి

హాసన్‌లో భారీ వర్షాలకు సకలేశపుర తాలూకాలో భారీగా పంటనష్టం జరిగింది. జాతీయ రహదారిలో మట్టి చరియలు విరిగిపడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పదులసంఖ్యలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హేమావతి జలాశయానికి 14వేలకుపైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కాగా 2,922 అడుగుల గరిష్ఠ సామర్థ్యం కాగా 2906 అడుగులకు నీరు చేరింది. కొడగు జిల్లా వ్యాప్తంగా, శివమొగ్గతోపాటు వివిధ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో కేఆర్ఎస్ జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో పెరిగింది. 39వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. 104-105 అడుగులకే పరిమితమైన కేఆర్ఎస్‌లో ఒక్కసారిగా 111 అడుగులకు నీరు చేరింది. 24గంటల వ్యవధిలో 3 అడుగులు 3 టీఎంసీల నీరు పెరగడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. సకలేశపుర తాలూకా గుళగళలె గ్రామంలో జాతీయ రహదారి 75పై ప్రహరీగోడ కూలిపోయింది. సుమారు 40 అడుగుల ఎత్తుతో అడ్డుగోడ నిర్మించగా అది కూలిపోయింది.



సకలేశపుర తాలూకాలో దెబ్బతిన్న జాతీయ రహదారి

చిక్కమగళూరు జిల్లా పరిధిలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తమయ్యింది. దాదాపు అన్ని నదులు పొంగి పొర్లుతున్నాయి. దూద్‌గంగా, వేద్‌గంగా, మలప్రభ, పంచగంగ, తుంగ, భద్ర, హేమావతి, వరదా, మాలతి, కుమద్వతి, శరావతి, గంగావలి, అఘనాశిని, కాళి, బాస్కెరి, బడగేణి నదులు పొంగి పొర్లుతున్నాయి. లింగనమక్కి, అంజనాపురతోపాటు అన్ని నదులకు నీరు చేరుతోంది. తుంగా జలాశయానికి 70వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. చిక్కమగళూరు జిల్లాలో శృంగేరి ఆలయం వద్ద తుంగానది ప్రవాహంతో భారతీతీర్థ రోడ్డు మునిగిపోయింది. పట్టణంలోని గాంధీమైదానం జలమయమైంది. రోడ్డు మునిగిపోవడంతో వాహన సంచారాన్ని నిలిపివేశారు.

కేరళ రాష్ట్రం వాయనాడులో భారీగా కురుస్తున్న వర్షాలకు కావేరి అనుబంధ జలాశయాలకు నీరు చేరుతోంది. కబిని జలాశయానికి 30వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కాగా 4 గేట్‌ల ద్వారా 36వేల క్యూసెక్కులను బయటకు వదులుతున్నారు. శివమొగ్గ జిల్లా ఆగుంబెలో అత్యధికంగా 24 గంటలలో 33 సెంమీ వర్షం కురిసింది. రాష్ట్రంలో ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి, చిక్కమగళూరు, శిమొగ్గ జిల్లాలను రెడ్ అలర్ట్ ప్రాంతాలుగా ప్రకటించారు. కొడగు జిల్లాలో వర్షాలకు లక్ష్మణతీర్థ నదికి ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. లక్ష్మణతీర్థ నదితోపాటు హనగొండ ఆనకట్టకు 4వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఈనెల 10నుంచి ఇప్పటివరకు 150 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 114 మి.మీ కాగా లక్ష్యానికి మించి కురవడం ఆశాజనకంగా ఉంది. మడికేరి తాలూకా సంపాజె గ్రామం, బండడికె గ్రామాలలో నివసిస్తున్న 4 కుటుంబాలు పయస్విని నది దాటే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వారు గట్టుకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అంకోలా తాలూకాలో మట్టిచరియలు విరిగిపడిన ప్రమాదంలో మృతులకు సీఎం సిద్దరామయ్య రూ.5లక్షల పరిహారాన్ని ప్రకటించారు. ఇలా భారీ వర్షాలతో ఆనకట్టలకు జలకళ సంతరించగా పలు చోట్ల వాహన సంచారానికి అంతరాయం నెలకొనడంతో కొంత ఇబ్బందిగా మారింది.



కొడగులో వాహనదారుల అవస్థలు

ఆల్మట్టికి లక్ష క్యూసెక్కులు..

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి జలాశయానికి ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. 26 గేట్లు ఉన్న ప్రాజెక్టులో 14 గేట్‌ల ద్వారా 23వేల క్యూసెక్కులు, జలాశయానికి కుడివైపున ఉండే విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి 42వేల క్యూసెక్కులు కలిపి 65వేల క్యూసెక్కుల నీరు వదిలారు. ఆల్మట్టి జలాశయం గరిష్ఠంగా 519.60 మీటర్లు (123.081 టీఎంసీల సామర్థ్యం) కాగా 517.79 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు ఉన్నట్లు తెలుస్తోంది.



ఆల్మట్టి గేట్ల నుంచి ప్రవహిస్తున్న నీరు

పోటెత్తుతున్న కృష్ణ

- కృష్ణా నదికి పెరిగిన వరద ప్రవాహం
- లోతట్టు గ్రామాలను అప్రమత్తం చేసిన అధికారులు

రాయచూరు : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి డ్యాంకు పెద్ద ఎత్తున వరద నీరు చేరి ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి నుంచి దిగువన నారాయణపూర్‌కు నీటిని పెద్ద ఎత్తున విడుదల చేయడంతో జిల్లాలో కృష్ణానది ఉధృతి పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గడచిన మూడు రోజుల క్రితం వరకు ప్రతి రోజు 5 నుంచి 6 వేల క్యూసెక్కుల నీటిని నారాయణపూర్ నుంచి దిగువకు విడుదల చేస్తున్న అధికారులు ఆల్మట్టి డ్యాం నుంచి ఉధృతి పెరగడంతో 65 వేల క్యూసెక్కుల నీటిని నారాయణపూర్ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో లింగసుగూరు, దేవదుర్గ, రాయచూరు, తాలూకాల్లోని పలు నది తీర గ్రామాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేసిన అధికారులు ప్రవాహ ఉధృతి పెరిగితే తీసుకోవల్సిన జాగ్రతల గురించి హెచ్చరించారు. కాగా ఇప్పటి వరకు నారాయణపూర్ నుంచి 65వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పిన అధికారులు ఇన్‌ఫ్లో పెరిగిన పక్షంలో దిగువకు కూడా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



నిండుకుండలా కేఆర్ఎస్



ఉరకలేస్తున్న కృష్ణమ్మ

కడుపులోనే కడతేర్చారు..

- 80కి పైగా లింగనిర్ధారణలు
- 40 మందికి గర్భస్రావాలు
- డబ్బుకోసం వైద్యుల పైశాచికం
- వలపన్ని అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం దారుణానికి పాల్పడ్డారు. ప్రాణం పోయాల్సిన పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న ఆ ప్రబుద్ధులు ప్రాణం పోసుకుంటున్న పసిగుడ్డులను కడుపులోనే నలిపేశారు. ప్రత్యేక అధికారుల బృందం వల పన్ని పట్టుకోవడంతో ఆ వైద్యుల బండారం బయటపడింది. భ్రూణహత్యలకు పాల్పడిన ఇద్దరు వైద్యులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బెళగావి జిల్లా గోకాక్, మూడలగి పట్టణంలో స్కానింగ్ ద్వారా లింగనిర్ధారణ, ఆడ శిశువుల గుర్తింపు, గర్భస్రావం చేస్తున్న రెండు ఆసుపత్రులను సీజ్ చేసి ఇద్దరు వైద్యులతో పాటు ఓ ఏజెంట్‌ను అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన ప్రత్యేక అధికారుల బృందం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పర్యటన సాగిస్తోంది. ఇందులో భాగంగా పలు ఫిర్యాదుల మేరకు బెళగావి జిల్లాలో అకస్మిక తనిఖీలు జరిపారు. గర్భధారణకు ముందే స్కానింగ్‌ద్వారా లింగనిర్ధారణ జరుపుతున్నట్లు గుర్తించారు. గోకాక్‌లోని ఇక్రా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కుటేజుల్లా కుబ్రా, ముడలగిలోని డాక్టర్ ఎస్ ఎస్ పాటిల్‌తోపాటు ఏజెంట్ తుకారామ భీమప్పలను అదుపులోకి తీసుకున్నారు. రెండు ఆసుపత్రుల్లో సుమారు 80కి పైగా లింగనిర్ధారణ పరీక్షలు జరిపారు. ఇందులో 40 మందికి పైగా గర్భస్రావం చేసినట్లు విచారణలో గుర్తించారు. మమదాపుర డాక్టర్ సిద్ధారూఢ పూజారి పరారీలో ఉన్నట్లు ప్రత్యేక బృందం అధికారి డాక్టర్ వివేక్ మంగళవారం మీడియాకు తెలిపారు. స్థానిక వైద్యాధికారులు సమాచారం ఇచ్చినమేరకు దాడులు చేశామన్నారు. దాడుల వేళ ఆసుపత్రుల్లో గర్భిణుల నుంచి సేకరించిన రూ.1.08 లక్షల నగదు,



రూ.20వేల ఫోన్‌పే బదిలీతో పాటు స్కానింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరు వైద్యులు నాలుగేళ్లుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. సోమవారం నలుగురు గర్భిణులు ఏజెంట్ ద్వారా గర్భస్రావం కోసం ఆసుపత్రికి వచ్చారు. ఏజెంట్‌కు రూ.15వేలు, గర్భస్రావం చేసేందుకు డాక్టర్‌కు రూ.20వేలుగా ఇవ్వాలని నిర్ధారించారు. అక్రమాలు బహిరంగమయ్యేందుకు అధికారులకు సమగ్ర సమాచారం అందించిన మహిళకు లక్ష రూపాయల రివార్డు ప్రకటించామన్నారు. ముగ్గురు మహిళలపైనా కేసులు నమోదు చేశామని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లింగనిర్ధారణ పరీక్షలపై నిషేధం ఉన్నా, కఠిన చట్టాలు అమల్లో ఉన్నా వైద్యులు దుశ్చర్యలకు పాల్పడడం గమనార్హం. ఇకపై ఎక్కడ నిబంధనలు వ్యతిరేకించినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.



హత్యకేసులో దర్శకుడి అరెస్టు


- 20 ఏళ్లపాటు అజ్ఞాతం



గజేంద్ర అలియాస్ గజ

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడిగా ఉంటూ 20ఏళ్లుగా పరారీలో ఉన్న దర్శకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు సవాల్‌గా మారిన సినిమా డైరెక్టర్ గజేంద్ర అలియాస్ గజను అరెస్టు చేసినట్లు సీసీబీ అధికారులు బుధవారం ప్రకటించారు. కన్నడ, మళయాళం భాషలలో గజేంద్ర దర్శకుడిగా పని చేశారు. 2004లో బెంగళూరు విల్సన్‌గార్డెన్‌లో రౌడీషీటర్ కొత్త రవి హత్యకు గురయ్యాడు. ఈకేసులో చంద్రప్ప, అల్యూమినియం బాబుతోపాటు దర్శకుడు గజేంద్ర 8వ నిందితుడిగా ఉన్నాడు. సుదీర్ఘకాలంగా కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. సీసీబీ పోలీసులు అతడిని గుర్తించి ఎట్టకేలకు అరెస్టు చేశారు. బుధవారం కోర్టు ముందు హాజరు పరిచారు. 20ఏళ్ల తర్వాత దర్శకుడు పట్టు బడడం చిత్రసీమలో చర్చనీయాంశంగా మారింది.

తుంగభద్ర డ్యాంకు జలకళ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1611.07	1,588.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	49,522	5,814
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	211	182
సామర్థ్యం (టీఎంసీలు)	39.72	9.99

● జలాశయానికి 63వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
● 40టీఎంసీలకు చేరిన నీటినిల్వ



వేగంగా వచ్చిచేరుతున్న ఇన్‌ఫ్లోతో కళకళలాడుతున్న టీబీడ్యాం

బళ్లారిసిటీ, జూలై17: తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కర్ణాటకాంధ్ర జీవ నాడి అయిన టీబీడ్యాంకు 63,320 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గతేడాది వర్షాభావ పరిస్థితులతో ఒక్క పంటే పండించిన తుంగభద్ర ఆయకట్టు రైతులు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుతం తుంగ రిజర్వాయర్ నుంచి 70,497 క్యూసెక్‌ల నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర జలాశయానికి మరింత నీరు చేరుతుందంటున్నారు. రిజర్వాయర్ గరిష్ట స్థాయి 1633 అడుగులు కాగా, ఈరోజు 1611అడుగులకు చేరింది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 105.78టీఎంసీలు కాగా ఇప్పటికే రిజర్వాయర్‌లో 40టీఎంసీల నీరు చేరింది.

త్వరలో కాల్వలకు నీటి విడుదల

ప్రస్తుతం జలాశయానికి వస్తున్న నీటి పరిమాణాన్ని పరిశీలిస్తే, రేపటికి రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం 50 టీఎంసీలు దాటనుంది. అందువల తాగునీటి సలహా కమిటీ సమావేశం ఏర్పాటుచేసి ఎడమ, కుడి దిగువ, ఎగువ కాల్వలకు (హెచ్‌ఎల్‌సీ) నీటిని విడుదల చేయాలని, తుంగభద్ర ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా ఉన్న మంత్రి శివరాజ్ తంగడి బుధవారం తెలిపారు. తుంగభద్ర జలాశయం ఎడమవైపున ఉన్న ఎల్‌బీఎంసీ కెనాల్, రాయ, బసవ కాల్వలకు నేటి నుంచి నీటి విడుదలను రిజర్వాయర్ ముఖ్య కార్యదర్శి బసవ రాజు ప్రారంభిస్తారని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమగౌడ తెలిపారు. నీరు విడుదల చేస్తారన్న సమాచారంతో వరినారు పెంచుకున్న హెచ్చెల్సీ ఆయకట్టు కింద ఉన్నరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్నిదానాల్లోకెల్లా రక్తదానం శ్రేష్ఠం



రక్తదానం చేస్తున్న రవి చెళ్లగుర్కి తదితరులు

బళ్లారి సిటీ, జూలై 17: రక్తదానం అన్నిదానాల కెల్లా శ్రేష్ఠమైందని, మరొకరి ప్రాణాలను కాపాడుతుందని బళ్లారి మహానగర పాలక మేయర్ ముల్లంగి నందీశ్ పేర్కొన్నారు. నగరంలోని రాఘవేంద్ర కాలనీలో బుధవారం గిహోన్ మినిస్ట్రి ట్రస్ట్, స్పందన రక్తనిధి కేంద్రం సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేసిన వారు దైవంతో సమానమన్నారు. ఈసందర్భంగా మహానగరపాలక సభ్యులు పేరం వివేక్, అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఒక్కరు రక్తదానం చేయడం ద్వారా ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చని, యువకులు రక్త దానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఆరోగ్యవంతమైన మనిషి ప్రతి మూడు నెలలకొకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రమాదంలో ఉన్న వారిని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్ర క్రియాశీల ఉపాధ్యాయ వేదిక బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి, 29వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో డి.రత్నకుమార్, రేగన్‌పాల్, సుదర్శన్,అంజనేయ,వినోద్ సంగనకల్లు, అంబరీశ్, ఎర్రి, మురళి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త వలలో శ్రీధరగడ్డ పీడీఓ



పత్రాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

బళ్లారి సిటీ, జూలై 17: బళ్లారి తాలూకా శ్రీధరగడ్డ పీడీఓ ప్రాణేశ్ లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కారు. లోకాయుక్త అధికారులు ఆయనను విచారిస్తున్నారు. శ్రీధరగడ్డకు చెందిన వీరేశ్ అనే వ్యక్తి గ్రామ పంచాయితీలో అభివృద్ధి చేసిన ప్రైవేట్ లేఔట్‌కు అనుమతి ఇవ్వాలని పీడీఓ ప్రాణేశ్‌ను సంప్రదించారు. కొత్తలేఔట్ అనుమతికి పీడీఓ రూ.7లక్షల లంచం డిమాండ్ చేశారు. మొదటి విడతలో రూ.2లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. దీనిపై వీరేశ్ లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజును సంప్రదించి జరిగిన విషయం తెలిపారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం మంగళవారం సాయంత్రం వీరేశ్ నుంచి పీడీఓ ప్రాణేశ్ రూ. 2లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడిచేసి నగదుతో పాటు లేఅవుట్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు

70 మొబైల్ ఫోన్ల స్వాధీనం



ఫోన్లను యజమానులకు అందిస్తున్న సీఐ

కంప్లి, జూలై 17 : హగరి బొమ్మనళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి గురైన 70 మొబైళ్లను దొంగల నుంచి స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న యజమానులకు సీఐ వికాస్‌లమాని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా హగరి బొమ్మనళ్లి, మరెమ్మనహళ్లి గ్రామాలు, పట్టణాలలో తరచూ మొబైళ్ల చోరీలు జరుగుతున్నాయని, ఈమేరకు ఫిర్యాదులు అందాయన్నారు. దొంగతనానికి పాల్పడుతున్న దొంగలను సీసీ కెమెరాలో గుర్తించి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 6.05 లక్షల విలువగల 70 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమ చుట్టూ అనుమానంగా తిరుగుతున్న వారిపై దృష్టి సారించి వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆయనతో ఎస్ఐ బసవరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుడి నిజాయితీ



నిజాయితీ చూపిన మారుతిని అభినందిస్తున్న అధికారి, బస్సులో దొరికిన బంగారు ఆభరణాలు

కంప్లి, జూలై 17 : హగరి బొమ్మనళ్లి డిపోలో బస్సులను శుభ్రపరిచే మారుతి తన నిజాయితీని చాటుకున్న ఉదంతం ఇది. మైమున్నాబేగమ్ హోస్పేట నుంచి హగరి బొమ్మనహళ్లికి కేఎస్ ఆర్టీసీ బస్సులో వెళుతూ, అందులో 50గ్రాముల బంగారు ఆభరణాల బ్యాగును మంగళవారం బస్సులోనే మరచిపోయి వెళ్లింది. బుధవారం ఉదయం మారుతి బస్సును శుభ్రం చేసే సమయంలో అతడికి బ్యాగు కనిపించింది. వెంటనే అతడు ప్రలోభానికి గురికాకుండా దానిని హగరి బొమ్మనళ్లి డిపోమేనేజరుకు అప్పగించారు. ఆ బ్యాగులోని అడ్రస్ ప్రకారం ఫోన్‌చేసి విషయాన్ని ప్రయాణీకురాలికి తెలపగా, బంగారం పోయిందనుకున్న ఆమె ఒక్కసారిగా ఊపిరిపీల్చుకుంది. మానవత్వం చాటుకున్న మారుతికి అధికారులు, మైమున్నాబేగమ్ కుటుంబీకులు అభినందనలు తెలిపారు.

గ్రామంలోకి ఎలుగుబంటి



కంప్లి, జూలై 17: హోస్పేట తాలుకా పరిధిలోని అనంతశయనం గ్రామంలోకి మంగళవారం రాత్రి ఓ ఎలుగుబంటి చొరబడింది. గ్రామంలోని ప్రజలు పీర్లపండుగ సంబరాల్లో వుండగా గ్రామంలోకి ఎలుగుబంటి ప్రవేశించింది. దానిని గమనించి కేకలు వేయగా అనంతపద్మనాభ స్వామి ఆలయంలోకి చొరబడింది. దానిని గ్రామస్థులందరూ కలిసి అడవిలోకి తరిమివేశారు. గ్రామాల్లోకి ఎలుగుబంట్లు రావడంతో గ్రామప్రజలు, భయభ్రాంతులవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం.. పీర్ల అగ్నిగుండ ప్రవేశం

కంప్లి, జూలై 17 : మొహరం వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామాల్లో భక్తులు అగ్నిగుండానికి ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు సమర్పించుకున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని దేవసముద్రం, ఇటిగి, షుగర్ ఫ్యాక్టరీ, జవుకు, జానూరు, ఎమ్మిగనూరు, గుత్తిగనూరు, కలకంబ్ల, తదితర గ్రామాలలో మంగళవారం రాత్రి మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం నిమజ్జనం సందర్భంగా పీర్ల దేవుళ్లను ఊరేగిస్తూ సంబరాలు చేపట్టారు. కంప్లి, కురుగోడు తాలుకాలోని పలు గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ బందోబస్తు చేపట్టింది.



సండూరులో కొలువైన పీర్లు



గుత్తిగనూరులో అగ్నిగుండం తొక్కడానికి ఏర్పాట్లు

తోరణగల్లు, జూలై 17 : సండూరు తాలుకాలో పీర్ల పండుగను అందరూ ఘనంగా జరుపుకున్నారు. అలాగే సండూర్ తాలుకా కురేకుప్ప పట్టణంలో పీర్ల కట్టపై పీర్లను విశేషంగా అలంకరించి భక్తులు చక్కెర చదివింపులు సమర్పించుకున్నారు. అలాగే అలాయి గుంతను ఏర్పాటుచేసి అగ్ని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అగ్నిగుండం వద్దకు వందలాదిగా తరలివచ్చారు. కురేకుప్ప గ్రామంలో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు.

బళ్లారి ఎంపీ ఎన్నిక రద్దు చేయాలి

● ఎస్టీ కార్పొరేషన్ నిధులను ఎంపీ ఎన్నికల్లో వినియోగించారు ● కోర్టులో హీరేమట్ పిటిషన్

బళ్లారి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ కార్పొరేషన్ నుంచి అక్రమంగా తరలించిన రూ. 187 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా జరిగిన ఎంపీ ఎన్నికల్లో వినియోగించిందని బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన అరుణ్ హిరేమట్ పేర్కొన్నారు. కనుక ఆ ఎంపీ ఎన్నికను రద్దుచేయాలని ఆయన సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. అంతేకాకుండా దీనిపై దర్యాప్తును కోరుతూ ధార్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో వుండగానే కర్ణాటకలో ఎస్టీ కార్పొరేషన్ నిధులు మళ్లించారని తెలిపారు. బళ్లారి ఎంపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా వున్న నాగేంద్ర ఆ నిధులను రాయచూరు, బళ్లారి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం వినియోగించివుంటారని ఆయన ఆరోపిస్తూ ధార్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఎంపీల ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎంపీలుగా గెలిచిన ఇద్దరూ ఎన్నికల ఖర్చుల నివేదికను అధికారులకు సమర్పించలేదని కోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎస్టీ కార్పొరేషన్ నిధులను ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల మేరకే ఎన్నికల్లో వినియోగించారన్నారు. దీనిపై విచారణ చేపట్టాలన్నారు. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీ అయిన బీజేపీ, జేడీఎస్ పార్టీలు దీనిపై కాంగ్రెస్‌ను విధానసౌధలో నిలదీశాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు కూడా కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఈ విషయం పోలీస్‌స్టేషన్, కోర్టుకు వెళుతుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత ఇరకాటంలో పడే ప్రమాదముంది.

జలధికి తరలిన పీర్లు



పేటే ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో పీర్ల ఊరేగింపు

సిరుగుప్ప, జూలై 17 : సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా బుధవారం పీర్ల దేవుళ్లను నిమజ్జనం చేశారు. సిరుగుప్ప పట్టణంలో పేటే ఆంజనేయస్వామి ఆవరణలో పీర్లు అన్నింటిని ఒకచోట చేర్చి ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఊరేగింపు చేశారు. కోలాహలంగా యువకులు పీర్లను మోసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు చేశారు.

ధర్మాచరణే 'కవిరాజమార్గ' ఆకాంక్ష

● ఆచార్య అమరేశ్ నుగడోని

బళ్లారి సిటీ, జూలై 17: ధర్మాన్ని గౌరవించాలనే ఆకాంక్ష కన్నడ తొలి వచన గ్రంథం 'కవిరాజమార్గం'లో వ్యక్తమైందని హంపి కన్నడ విశ్వవిద్యాలయ రిటైర్డ్ ఆచార్యుడు అమరేశ్ నుగడోని అన్నారు. నగరంలోని శ్రీమతి సరళాదేవి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెంటర్, కన్నడ విభాగం ఆధ్వర్యంలో 'సాహిత్యం', మతం, సామాజిక సరస్పర సంబంధం అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్తమానంలో అందుకు విరుద్ధంగా ఉండడం అసత్యాలకు , నిజాలకు మధ్య సంఘర్షణగా మారడం దురదృష్టకరమన్నారు. ప్రధానంగా సాహిత్యం సమాజాన్ని కొత్తకోణంలో చూసే దృక్పథాన్ని ఇస్తుందన్నారు. మానవ కులమే మతం అని కవి పంప చెప్పగా, ఆయన తరువాత వారు దయనే మతానికి మూలమని చెప్పి మత నిర్వచనాన్ని విస్తృతం చేశారని విశ్లేషించారు. ప్రపంచంలో దేవుడు లేడని బుద్ధుడు చెప్పాడని, బసవన్న కాయకష్టంలో దేవుణ్ణి చూశాడన్నారు.

కన్నడ విభాగాధిపతి దస్తగిరిసాబ్ మాట్లాడుతూ కన్నడ సాహిత్య వారసత్వం సమాజంలో మానవీయ విలువలు, సహజీవనం, బహుత్వభావాలను నాటిందని, తద్వారా మానవధర్మాన్ని నిలబెట్టిందని అన్నారు. నేటి సమాజంలో ఎక్కడ చూసినా హింస, అసూయ, అత్యాచారాలు, అన్యాయం, ఏకతాటిపై నడుస్తున్నాయన్నారు. ఇలాంటి కల్లోల పరిస్థితిలో సాహిత్య పఠనం మాత్రమే మన అంతరంగిక దృష్టిని విస్తృతపరచి మాన వీయ చైతన్యాన్ని ఏర్పరుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ మనిషి ఉత్తమ మార్గంలో జీవించేందుకు సాహిత్యం మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఈసందర్భంగా హొన్నూర్‌వలి, ఆచార్యులు రామస్వామి, ప్రవీణ్‌కుమార్, లింగప్ప, బసప్ప, చంద్రశేఖర్, మహంతేశ్, శివలింగప్ప, మల్లప్ప, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అమరేశ్ నుగడోని

ప్రమాదాలకు ఆస్కారమివ్వద్దు: ఎస్పీ



తోరణగల్లు, తారానగర్ రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కంప్లి, జూలై 17 : సండూరు నుంచి తోరణగల్లు వెళ్లే దోవలో ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సుధారాణి తెలిపారు. బుధవారం తోరణగల్లు, తార్‌నగర్ ప్రాంతాల్లోని రోడ్లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అలాగే మద్యపానం చేసి డ్రైవింగ్ చేసేవారిపై కూడా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలాగే వేగంగా వాహనాలు నడిపే డ్రైవర్లు ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఇన్సురెన్స్ కలిగి ఉండేలా చూడాలన్నారు. ప్రధాన కూడలిలో పోలీసు సిబ్బందిని కూడా వుంచాలన్నారు. వారితో పాటు డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే, మహేష్ గౌడ, వీరేష్ వారితో పాటు వున్నారు.

హోసూరు జోన్

ఆధునిక టెక్నాలజీలపై అలరించిన నాటక ప్రదర్శన



టెక్నాలజీలపై అవగాహన నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హోసూరు, జూలై 17 : హోసూరు తమిళనాడు సైన్స్ మూవ్‌మెంట్ నిర్వహిస్తున్న 13 వ వార్షిక పుస్తక మహోత్సవంలో 5వ రోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కంప్యూటర్, అండ్రాయిడ్, ఏఐ, హ్యూమస్‌పై టెక్నాలజీలపై ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను అలరించింది. నేటి యుగంలో, కంప్యూటర్, రోబోట్, ఆండ్రాయిడ్, ఏ1 టెక్నాలజీలు మనవాళిని అతలాకుతలం చేస్తున్నాయి. వీటివలన అనేక ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి ముఖ్యంగా వర్తమాన భవిష్యత్ తరాలను పూర్తిగా ఆక్రమించిన ఈ సాంకేతికతలతో, శాస్త్రీయత అభివృద్ధి చెందినప్పటికీ, అవి మానవజాతి మానసిక, శారీరక శ్రేయస్సుకు ముప్పు కలిగిస్తున్నాయి. అయితే, ఈ సాంకేతికతలను ఉపయోగించడం, వారి ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉంటుందంటున్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గం కన్పించడంలేదు. అటువంటి సాంకేతికతలతో , డాక్టర్ కోసం వెతకడానికి బదులుగా, హ్యూమస్‌పై టెక్నాలజీ ద్వారా వైద్యుడిని సృష్టించి మానవుల అవసరాలను తీర్చవచ్చు. భవిష్యత్‌లో కంప్యూటర్, రోబోట్, ఆండ్రాయిడ్ ఏఐ, హ్యూమస్‌పై వంటి సాంకేతికతలు మానవాళిని ఎలా ప్రభావితం చేస్తాయో, వాటి సాధకబాధకాలపై అవగాహన కల్పించేందుకు మడివాళం ప్రాంతంలోని ప్రభుత్వ మిడిల్ స్కూల్ విద్యార్థులు నాటకం ప్రదర్శించారు. పెద్ద సంఖ్యల్లో ప్రేక్షకులు ఈ నాటకాన్ని ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

పిల్లలకు పౌష్టిక అల్పాహారం ప్రారంభం

హోసూరు (కృష్ణగిరి) జూలై 17: ముఖ్యమంత్రి నేతృత్వంల్లోని తమిళనాడు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో 1 వ తరగతి నుంచి 5 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముఖ్యమంత్రి అల్పాహార పథకం మొదటి దశను ప్రారంభించింది. ఇటీవల ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని విస్తరించి ప్రారంభించారు. పాఠశాల విద్యను మరింత విస్తృతం చేయడానికి , నేర్చుకోవడం మరింత ఆనందదాయకంగా మార్చడానికి , పిల్లలందరూ ఆకలి లేకుండా చదివేలా చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని , గ్రామీణా ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారు. పాఠశాలల వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.10 లక్షల అలంకరణ వస్తువులు అగ్నికి ఆహుతి

హోసూరు (క్రైం) జూలై 17 :హోసూరు ఎంజీ రోడ్డులో సుధాకర్(46)కు చెందిన ప్యాన్సీ స్టోర్ గోడౌన్‌లో బుధవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నించినా వీలుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది నాలుగు గంటలపాటు శ్రమించి గోడౌన్‌లో మంటలను ఆర్పారు. ఈ ఘటన ఈప్రాంత మంతా కలకలం సృష్టించింది. గోడౌన్‌లో దాదాపు రూ.10 లక్షల వరకు అలంకరణ వస్తువులు ఉన్నట్లు దుకాణాదారులు తెలిపారు. హోసూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



అగ్నికి ఆహుతి అయిన ప్యాన్సీ స్టోర్ గోడౌన్

రాయచూరులో ఘనంగా మొహరం

రాయచూరు, జూలై 17 : నగరంలోని పలు మసీదుల్లో మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. 11 రోజుల పాటు సాగిన పీర్ల ఊరేగింపులో బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పీర్ల నిమజ్జనానికి తరలివెళ్లారు. కాగా జిల్లాలోని చారిత్రక పట్టణంగా చెప్పుకునే ముదగల్ పట్టణంలో నిర్వహించిన పీర్ల పండుగ గడచిన మూడు రోజులుగా అత్యంత కోలాహలంగా సాగుతుండగా రియాజ్ ఖాన్, ఫారుక్, సయ్యద్ అబ్దుల్ ఖాద్రి (సాహెబ్ కౌతాళం)లతో పాటు భక్తులు పాల్గొని పీర్లను దర్శించుకున్నారు. నగరంలోని ఉప్పారవాడిలో నిర్వహించిన మొహరం వేడుకల్లో స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై పీర్లను దర్శించుకున్నారు.



ముదగల్ పట్టణంలో వేలసంఖ్యలో పాల్గొన్న భక్తులు

నగర పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎంపీ

రాయచూరు, జూలై 17 :వర్షకాలం ప్రారంభమైన నేపధ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నగర స్వచ్ఛతకు తొలి ప్రాధాన్యతనివ్వాలని రాయచూరు కాంగ్రెస్ ఎంపీ జీ కుమార్ నాయక్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యతో సమావేశమైన ఎంపీ పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగాలన్నారు. అదే సమయంలో పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల క్రితం తాను నగర పర్యటన చేసిన సందర్భంగా అనేక చోట్ల దోమల బెడద ఉన్నట్లు ఫిర్యాదులందాయని డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా పారిశుద్యానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. అదే సమయంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వారికి తగిన సూచనలివ్వాలన్నారు.




కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎంపీ కుమార్ నాయక్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామెంట్...

జయేంద్ర సరస్వతి స్వామిజీ (జయంతి)




కంచికామకోటి పీఠాధిపతిగా పేరొందిన జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామిజీ 1935 జూలై 18న తంజావూరు జిల్లా ఇరుల్ నీకిలో న్మించారు. బాల్య నామం సుబ్రహ్మణ్య అయ్యర్. నడిచే దేవుడిగా పేరున్న కంచి పరమాచార్య చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామిజీ ఆయనను ఎంపిక చేశారు. 1954 నుంచి జయేంద్ర సరస్వతిగా పిలవబడుతున్నారు. హిందూధర్మ ప్రచారానికి ఎనలేని కృషి చేశారు. వివిధ ప్రాంతాలలో చాతుర్మాస్య దీక్షలు నిర్వహించి పీఠం ప్రాశస్త్యాన్ని ఇనుమడింప చేశారు. పలు పాఠశాలలు, ఆసుపత్రులు నిర్మించి మానవసేవయే మాధవసేవ అని చాటి చెప్పారు. 2018 ఫిబ్రవరి 28న పరమపదించారు.

నెల్సన్ మండేలా (జయంతి)




'నోబెల్ శాంతి పురస్కార' గ్రహీత నెల్సన్ మండేలా 1918 జూలై 18న జన్మించారు. దక్షిణాఫ్రికాకు చెందిన జాతివివక్ష వ్యతిరేక ఉద్యమకారుడు, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు. ఉద్యమంలో తలెత్తిన మారణకాండకు 27ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవించారు. 'నల్లజాతి సూరీడు'గా అభివర్ణించబడ్డారు. జైలునుంచి విడుదలయ్యాక దేశంలో నెలకొన్న జాతివైర్యాన్ని నివారించడానికి ఎంతో కృషి చేశారు. పూర్తిస్థాయి ప్రజాస్వామ్య పద్ధతిన ఎన్నికై 1994 నుంచి 1999వరకు దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా వ్యవహరించారు. శాంతికోసం పాటుపపడిన ఆయనకు ఎన్నో పురస్కారాలు దక్కాయి. 2013 డిసెంబరు 5న కన్నుమూశారు.

మెహిది హాసన్ (జయంతి)




'గజల్ చక్రవర్తి'గా పేరొందిన మెహిది హాసన్ 1927 జూలై 18న లూనాలో జన్మించారు. రాజస్థాన్‌లో సంప్రదాయ ధృపద్ సంగీతకారుల కుటుంబానికి చెందినవారు. గజల్ గాయనంలో రాణించారు. రేడియో పాకిస్థాన్‌లో తుమ్రి గాయకుడిగా కెరీర్‌ను ప్రారంభించిన ఆయన 50వేలకుపైగా గజల్స్ ఆలపించారు. దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. జలంధర్‌లో సైగల్ అవార్డు, నేపాల్‌లో గోర్ఖా దక్షిణ బహు అవార్డు, ఇతర పురస్కారాలు పొందారు. 2012 జూన్ 13న కన్నుమూశారు. 2018లో 91వ జయంతికి గూగుల్‌డూడుల్ ఏర్పాటు చేసింది.

రాజేశ్‌ఖన్నా (వర్ధంతి)



రాజేశ్‌ఖన్నా 1942 డిసెంబరు 29న అమృత్‌సర్‌లో జన్మించారు. అసలుపేరు జతిన్ ఖన్నా. ఇండియన్ సినిమాలో 'తొలి సూపర్ స్టార్' ఆయనే. 1969 నుంచి 1971 వరకు వరుసగా 15 సోలో సినిమాలతో రికార్డు సృష్టించారు. అప్పట్లో ఆయన అత్యధిక పారితోషికం అందుకున్న నటులలో ఒకరు. 'ఆఖ్రి ఖాత్' సినిమా 1967లో ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. 168కు పైగా ఫీచర్ ఫిల్మ్స్, 12 షార్ట్ ఫిల్మ్స్ తీశారు. ఉత్తమనటుడిగా 3 ఫిల్మ్‌ఫేర్, 4 బీజేఎఫ్‌ఏ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా వ్యవహరించారు. 2012 జూలై 18న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మ భూషణ్' అవార్డు ప్రకటించారు.

విన్ డీజిల్ (పుట్టినరోజు)



విన్ డీజిల్ 1967 జూలై 18న జన్మించారు. అసలు పేరు మార్క్ సింక్లైర్, అమెరికాకు చెందిన నటుడు, నిర్మాత. 'డొమినిక్ టొరెట్టో' సినిమాతో పేరొందారు. 'వన్ రేస్ ఫిల్మ్స్' ప్రొడక్షన్ కంపెనీ స్థాపించారు. అవేకనింగ్స్, మల్టీఫేషియల్, ఫాస్ట్ ఫైవ్, బ్లడ్‌షాట్ వంటి అవతార్ తదితర సినిమాలను రూపొందించారు. బుల్లితెర పైనా, వీడియోగేమ్స్‌లోనూ సత్తా చాటుకుని పలు అవార్డులు పొందారు.

ప్రియాంక చోప్రా (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత ప్రియాంక చోప్రా జోనస్ 1982 జూలై 18న బీహార్ రాష్ట్రం జంషెడ్‌పూర్ (ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రం)లో జన్మించారు. నటి, నిర్మాత, గాయని, మోడల్‌గా రాణిస్తున్నారు. అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటీమణులలో ఒకరు. 'మిస్ వరల్డ్ 2000' అందుకున్నారు. 2008లో హిందీలో ఫ్యాషన్ సినిమాకు నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ యాక్ట్రెస్ అందుకున్నారు. ఇలా రెండు నేషనల్ అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్, ఇతర అవార్డులు పొందారు. ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2022లో బీబీసీ 100 ఉమెన్ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

స్మృతి మంధాన (పుట్టినరోజు)



అర్జున అవార్డు గ్రహీత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన 1996 జూలై 18న ముంబైలో జన్మించారు. 16వ యేటనే 2013లో క్రికెట్‌లో జాతీయస్థాయిలో రాణించారు. 2014లో ఇంగ్లండ్‌పై టెస్ట్ పోటీల్లో పాల్గొన్నారు. 2018లో బీసీసీఐ నుంచి బెస్ట్ ఉమెన్స్ ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా, 2022 జనవరిలో ఐసీసీ ఉమెన్స్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అందుకున్నారు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్‌గేమ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్‌కు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించారు. వన్డేలు, టెస్ట్ మ్యాచ్‌లు, టి-20 క్రికెట్‌లలోనూ మ్యాచ్‌లలో డొమెస్టిక్‌లోనూ, అంతర్జాతీయ కెరీర్‌లోనూ సత్తా చాటుకున్నారు.

ఆలయంలో చోరీ

శిడ్లఘట్ట, జూలై 17: పట్టణంలోని కేఎస్‌ఆర్టీసీ బస్టాండ్ సమీపానగల నల్లాపుర ఆలయ హుండీ చోరీకి గురైంది. వేకువజామున 2-4 గంటల మధ్య దుండగులు చొరబడి హుండీని పగలగొట్టి సుమారు 15వేల రూపాయల దాకా చోరీ చేసినట్లు తెలుస్తోంది. ఉదయం ఆలయాన్ని తెరవడానికి రాగా చోరీ విషయం వెలుగు చూసింది. ఆలయ సమితి కార్యదర్శి రమేశ్ ఫిర్యాదు మేరకు శిడ్లఘట్ట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు



మొహరం పండుగలో ఉత్సాహంగా..

బాగేపల్లి, జూలై 17: ఆధునికత ఎంత పెరిగినా హిందూ ముస్లింల భాయిక్యతకు సంకేతంగా ఉన్న మొహరం ప్రతి ఏడాది తన అస్తిత్వాన్ని వృద్ధి చేసుకుంటోంది. త్యాగ బలిదానాలకు సంకేతంగా మొహరంను తాలూకా కేంద్రమైన బాగేపల్లిలో ముస్లింలు బుధవారం ఆచరించారు. పట్టణంలోని బయలు ఆంజనేయస్వామి మెయిన్‌రోడ్డులోని దర్గాలో (పీర్ల చావిడి)లో ప్రత్యేక అలంకరణ చేశారు. పకీర్‌లు చెనిగి పప్పు, చక్కెర, అటుకులు, కలకండ పలురకాలు నైవేద్యంగా సమర్పించారు. మొహరం చివరిరోజు అగ్నిగుండ ప్రవేశం చేశారు. తాలూకాలోని వివిధ గ్రామాలలో మొహరం సంబరంగా సాగింది.

చేళూరులో...

చేళూరు: చేళూరులో కూడా మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి. హిందూ ముస్లింలు కలసికట్టుగా పాల్గొన్నారు. పీర్ల చావిడిని విద్యుద్దీపాలతో అలంకరించారు. యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

చింతామణిలో..

చింతామణి: చింతామణి పట్టణం తాలూకా వ్యాప్తంగా మొహరం సంబరంగా సాగింది. పురవీధులలో పీర్లను ఊరేగించిన అనంతరం అగ్నిగుండ ప్రవేశం చేశారు. ముస్లింలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నారసింహపేట, టిప్పునగర్, సొణ్ణశెట్టిహళ్ళి, కీర్తినగర్, గద్వాల్‌పేట తదితర ప్రాంతాల్లో ఊరేగింపు సాగింది. రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

దొడ్డబళ్ళాపురలో..

దొడ్డబళ్ళాపుర: పట్టణం సహా తాలూకావ్యాప్తంగా మొహరం పండుగలో పీర్ల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది హనియూరు గ్రామంలో 350కుపైగా కుటుంబాలు ఉండగా ఒకే ఒక్క ముస్లిం కుటుంబం ఉంది. అయితే మొహరం పండుగను అందరూ కలసికట్టుగా ఆచరించడం విశేషం.



చింతామణిలో అగ్నిగుండం ఏర్పాటు



బాగేపల్లిలో పీర్లకు అలంకరణ



చేళూరులో పీర్ల ఊరేగింపు



దొడ్డబళ్ళాపురలో పీర్ల ఊరేగింపు

మెరుగైన సేవలే లక్ష్యం

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సిటిజన్ కో-ఆపరేటివ్ బ్యాంకు నిరంతరంగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఛైర్మన్ పీఆర్ వీపీఎస్ రాజు తెలిపారు. బుధవారం సీతా సర్కిల్‌లో ఖాతాదారుల సమావేశం జరిగింది. బెంగళూరు, చన్నసంద్ర శాఖల ఖాతాదారులు పాల్గొన్నారు. వాసిరెడ్డి హనుమంతరావు అన్ని వర్గాలకు ఆర్థికసాయం నిబంధనలకు అనుగుణంగా సమకూర్చాలనే సిటిజన్ కో ఆపరేటివ్ బ్యాంకు స్థాపించారన్నారు. 27ఏళ్లలో ఆరు రాష్ట్రాలు 42శాఖలతో సమర్థవంతంగా నడుస్తోందన్నారు. జూన్ ఆఖరుకు 4వేల కోట్ల రూపాయల లావాదేవీలు సాధ్యమయ్యాయన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కేవీ సుబ్బయ్య బ్యాంకు సేవలను వివరించారు. బెంగళూరుశాఖ మేనేజర్ జగదీశ్, చన్నసంద్ర బ్రాంచ్ మేనేజర్ చైతన్యరావ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఛైర్మన్ రాజు

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ప్రారంభం

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): దక్షిణభారత్‌లోనే తొలి మెట్రో ట్రాక్, ఫ్లై ఓవర్ నగర ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. జయనగర్ రాగిగుడ్డ ప్రదేశం నుంచి సెంట్రల్ సిల్క్‌బోర్డ్ దాకా 3.36 కిలోమీటర్ల ఎలివేటెడ్ రోడ్ కమ్ మెట్రో ఫ్లై ఓవర్‌ను డీసీఎం డీకే శివకుమార్ లాంచనంగా ప్రారంభించారు. ఎలక్ట్రానిక్‌సిటీ వైపు వెళ్లే మెట్రో మార్గం కోసం ఇక్కడ బ్రిడ్జ్ నిర్మించారు. నేలమట్టం నుంచి 8 మీటర్ల ఎత్తులో వాహనాల సంచారానికి ఫ్లై ఓవర్‌ను, 16 మీటర్ల ఎత్తులో మెట్రో రైలు ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఏడాది ఆఖరికి మెట్రో సంచారం ఆరంభం కానుంది. ఈ సందర్భంగా మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్‌ప్రారంభంలో డీసీఎం డీకే శివకుమార్

చోరీలపై పోలీసుశాఖ అప్రమత్తత



ఆసుపత్రిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

దొడ్డబళ్ళాపుర, జూలై 17: ఇటీవలికాలంలో ప్రత్యేకించి గొలుసుచోరీలు ఎక్కువ అవుతుండడంతో అడ్డుకట్ట వేసేలా పోలీసుశాఖ అప్రమత్తమైంది. సరిహద్దు జిల్లా, తాలూకాలలో దొంగతనాలు పెరగడంపై ముందస్తు చర్యలకు సిద్ధమయ్యారు. పట్టణంలో ప్రవేశించే మార్గాలలో నాకాబందీ నిర్వహించడం, అనుమానిత ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలైన ఆసుపత్రి, బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకించి మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సాదిక్‌పాషా నేతృత్వంలో నాకాబందీ నిర్వహిస్తున్నారు. పట్టణ, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనూ అక్కడి సిబ్బందికి సలహా సూచనలు చేశారు. నగలు, మాంగల్యం గొలుసు ఇతరత్రా వంటివి బహిరంగంగా కనబడేలా ఆడంబరంగా ధరించరాదని, అపరిచితులపట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది శృతి, జగదీశ్‌కుమార్ సూచించారు. ఇదే సందర్భంగా భారతీయ న్యాయసంహిత గురించి ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. మారుతున్న చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఏఎస్ఐ ప్రసన్న, సిబ్బంది రమేశ్‌యాదవ్ సుధా తదితరులు పాల్గొన్నారు.

మద్యం వ్యసనం నుంచి బయట పడండి

శిడ్లఘట్ట, జూలై 17: ఎన్నో ఇబ్బందులకు కారణమయ్యే మద్యం వ్యసనం ఇతర దురలవాట్ల నుంచి బయటపడాలని కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని హండిగనాళలోని కెంపణ్ణ వీరణ్ణ భవన్‌లో ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ, అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక, మద్యనియంత్రణ శిబిరం సమితి, ప్రగతిబంధు స్వసహాయ సంఘాల సమాఖ్య, నవజీవన సమితి, స్థానిక సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మద్య వ్యసన నియంత్రణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మద్యం వ్యసనం వల్ల ఆరోగ్యం దెబ్బ తినడంతోపాటు సంసారం ఛిద్రమవుతుందన్నారు. ఇలా పలు విధాలా నష్టం కలిగించే అలవాట్లు మానుకునేలా మద్య నియంత్రణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 25మందికిపైగా మద్యానికి బానిసైనవారికి శిబిరంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రశాంత్, సురేశ్‌గౌడ, జనజాగృతి వేదిక యోజనాధికారి తిమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరం ప్రారంభంలో ప్రముఖులు

హ్యాకథాన్‌తో విద్యార్థుల్లో ఆలోచనల పెంపు



ఐబీఎం స్కిల్‌బిల్డ్ హ్యాకథాన్ ప్రారంభంలో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యారంగంలో ఆధునాతన ఆవిష్కరణలకు విద్యార్థి దశలో హ్యాకథాన్ ఆలోచింపచేసే విధంగా ఉంటుందని బీఎన్‌ఎంఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే రామమూర్తి అభిప్రాయపడ్డారు. బీఎన్‌ఎంఐటి క్యాంపస్‌లో ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ఇండియాతో కలిపి రెండు రోజుల హ్యాకథాన్ నిర్వహించారు. ఎకో ఈక్విపై అంశంతో రెండు రౌండ్ల హ్యాకథాన్ సాగింది. సమగ్ర భవిష్యత్తుతోపాటు గుణాత్మక విద్య, లింగ సమానత్వం, సుస్థిరత, శుద్ధతాగునీరుతోపాటు వివిధ విభాగాలలో హ్యాకథాన్ జరిగింది. ఐబీఎం స్కిల్ బిల్డ్ ఇండియాకు చెందిన నిపుణులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మొదటిరౌండ్‌లో 280 జట్లు పాల్గొనగా చివరకు 50 జట్లు చేరాయి. డీన్ ఈశ్వర్ ఎన్ మాన్యె, ఐబీఎం కన్సల్టింగ్ ఇండియా ముఖ్యులు శ్రీవత్సకామిశెట్టి ప్రభాకరన్, ఐబీఎం సౌత్ ఏషియా సీఎస్‌ఆర్ లీడర్ షిప్రాశర్మ, బీఎన్‌ఎంఐటి ఛైర్మన్ నారాయణరావ్ మాన్య, అడిషినల్ డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వై కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణబెళగొళలో కేంద్ర మాజీ మంత్రి

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శ్రావణబెళగోళలోని వింధ్యగిరి కొండపై కొలువైన బాహుబలిని కేంద్ర మాజీ మంత్రి ప్రదీప్‌కుమార్ జైన్ ఆదిత్య బుధవారం సందర్శించారు. అనంతరం దిగంబర జైన్ మహాసంస్థాన పీఠం అధ్యక్షుడు చారుకీర్తి భట్టారక పండితాచార్య మహాస్వామిజీ ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి ప్రదీప్‌కుమార్ జైన్ భార్య స్నేహలత, కుమారుడు గౌరవ్‌జైన్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆదిత్య జైన్‌కు జ్ఞాపిక అందజేత

40వేల మొక్కల పంపిణీ లక్ష్యం

దొమ్మసంద్ర, జూలై 17: ఆనేకల్ పరిధిలోని అటవీశాఖకు చెందిన బన్నేరుఘట్ట సమీపాన భూతానహళ్ళిలోని మినీ అటవీ ప్రదేశంలో స్టార్ ప్రాపర్టీస్ సంస్థ సహకారంతో విద్యానికేతన్ స్వచ్ఛంద సంస్థ 40వేల మొక్కల పంపిణీకి సిద్ధమైంది. సుమారు వందకుపైగా వివిధ ఔషధ మొక్కలు ఉన్నాయి. పలు రకాల పండ్ల మొక్కలు కూడా ఉన్నాయి. పచ్చదనమే లక్ష్యంగా భూతానహళ్ళిలోని ప్రభుత్వ ప్రదేశం లో చిన్నపాటి అటవీ ప్రదేశంగా తీర్చేందుకు కృషి చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సంస్థ సీఎస్‌ఆర్ హెడ్ అభినవ్‌కాంచన్, మనోజ్‌కుమార్, విద్యానికేతన్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం నాగరాజు, ప్రాజెక్టు మేనేజర్ చైత్ర, శశిధర్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంస్థల నిర్వాహకులు అటవీ సిబ్బంది తదితరులు

అపెక్స్ బ్యాంకు రుణాల మంజూరులో గోల్‌మాల్

▸▸ విచారణ జరిపించాలని గవర్నర్‌కు వినతి

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి హల్‌చల్ చేస్తున్న తరుణంలోనే మరో వివాదం తెరపైకి వస్తోంది. అపెక్స్ బ్యాంకు రుణాల మంజూరులో భారీ గోల్‌మాల్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సహకారశాఖ మంత్రి సుదీర్ఘ కాలంగా అపెక్స్‌బ్యాంక్ మంత్రి ఛైర్మన్ కేఎన్ రాజణ్ణపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. పలు బినామీ కంపెనీల పేరిట రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. రుణాలు పొందిన కంపెనీలు దివాళా తీసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని దినేశ్ కల్లహళ్ళి అనే వ్యక్తి ఆరోపించారు. ఆడిట్ రిపోర్ట్, విచారణ నివేదిక, రిజిస్ట్రార్ నివేదికలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని అందుకే హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. 2021లో ఆడిట్ రిపోర్టులో తప్పులు ఉన్నాయని, ప్రభుత్వానికి రిజిస్ట్రార్ లేఖ రాసినా స్పందించడం లేదని ఆరోపించారు. ఈమేరకు దినేశ్‌కల్లహళ్ళి విచారణ కోరుతూ గవర్నర్‌కు విన్నవించారు. రాజ్‌భవన్ నుంచి ప్రభుత్వానికి సూచనలు వచ్చినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

యూకే లేబర్ పార్టీ జాతీయ కార్యవర్గ సమితికి

నీరజ్‌పాటిల్ ఎంపిక



డాక్టర్ నీరజ్ పాటిల్

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): లండన్ బరో ఆఫ్ లాంబెర్త్ మాజీ మేయర్ డాక్టర్ నీరజ్ పాటిల్ పార్టీలో అత్యున్నత నిర్ణయాలు తీసుకునే బ్రిటీష్ లేబర్‌పార్టీ జాతీయ కార్యవర్గ సమితి సభ్యుడిగా ఎంపికయ్యారు. లేబర్‌పార్టీ జనరల్ సెక్రటరీ ఈ విషయాన్ని ప్రకటించింది. ఎన్‌హెచ్‌ఎస్‌లో 28ఏళ్లుగా సేవలందిస్తూ ప్రమాదాలు, అత్యవసర వైద్య సలహాదారుడిగా డాక్టర్ పాటిల్ వ్యవహరిస్తున్నారు. 20ఏళ్లుగా లేబర్‌పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. సెయింట్ థామస్ ఆసుపత్రి, కింగ్స్ కాలేజ్ ఆసుపత్రి ఫౌండేషన్ గవర్నర్‌గా సేవలందించారు. ఎనిమిదేళ్లపాటు ల్యాంబెర్త్ కౌన్సిల్‌లో సేవలందించారు. 2015లో బ్రిటీష్ పార్లమెంటు ఎదుట బసవేశ్వర విగ్రహాన్ని స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు. బసవణ్ణ విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరించిన సంగతి విదితమే.

అబూదబికి ప్రతిరోజూ ఎయిరిండియా విమానం

బెంగళూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అబూదబికి ఎయిరిండియా సంస్థ ప్రతిరోజూ విమాన సర్వీసులను నడపనుంది. ఈమేరకు షెడ్యూల్ ప్రకటించారు. ఈనెల 22నుంచి ఐఎక్స్ 819 విమానం రాత్రి 8.15కు బయల్దేరనుంది. అక్కడనుంచి ఐఎక్స్ 820 విమానం తెల్లవారున 5.20కు మంగళూరుకు చేరుకోనుందని ప్రకటించారు. ప్రస్తుతం మంగళ, గురు, శని, ఆదివారాలలో అబూదబికి నాలుగు విమానాలు సంచరిస్తున్నాయి. ప్రస్తుతం మిగిలిన మూడు రోజులు కూడా విమానసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ అబూదబి, బహ్రెయిన్, దుబాయ్, దమన్, దోహా, జెడ్డా, కువైట్, మస్కట్‌లలో సేవలు ఉన్నాయి. ఇండిగో విమాన సర్వీసులు ఆగస్టు 9 నుంచి అబూదబికి ఆరంభించనున్నట్లు ప్రకటించింది. సాయంత్రం 4 గంటలకు అబూదబి నుంచి వచ్చే విమానం రాత్రి 9.40కు బయల్దేరనుంది. తద్వారా అబూదబికి వారంలో 14 విమానసర్వీసులు అందుబాటులోకి కానున్నాయి. ప్రస్తుతం వారానికి 4 సర్వీసులు మాత్రమే ఉన్నాయి. ఇక దేశీయ సర్వీసులలో ఎయిరిండియా ఈనెల 22నుంచి మంగళూరు నుంచి బెంగళూరుకు కొత్త విమానసేవలను ఆరంభించనుంది. సోమ, బుధ, శుక్ర వారాలలో సాయంత్రం 6.25 కు మంగళూరుకు చేరుకునే విమానం గురు, శనివారాలలో ఉదయం 7.05 గంటలకు బయల్దేరనుంది.